# కొత్త ఇల్లు



ఆనందరావుకి ఎప్పటి నుంచో కోరిక, ఆధునిక పద్ధతిలో అందమైన ఒక కొత్త ఇల్లు కట్టించాలని. ప్రస్తుతానికి తాతల నాటి పాత కొంప వారసత్వంగా వస్తే అందులో ఉంటున్నాడు. అది చిన్న ఇల్లు కావటమే కాకుండా గాలీ, వెలుతురూ కూడా తక్కువే! అక్కడక్కడ పెచ్చులూడిపోయిన గోడలు, ఒద్దు వంగిన పైకప్పు, ఎలుకలు తవ్విన నేల— వీటితో విసుగెత్తిపోయిన ఆనందరావు ఏది ఏమైనా సరే ఆధునాతన పద్ధతిలో ఇల్లు కట్టించి తీరాలన్న నిశ్చయానికి వచ్చాడు. వచ్చిందే తడవుగా ముందు స్థల నిర్ణయం చేశాడు. వూరికి దూరంగా కొత్తగా కడుతున్న కాలనీకి పైగా పెద్ద ఇంటి స్థలం అమ్మకానికి ఉందని తెలిసి వివరాలు కనుక్కొని వెళ్ళి చూసి వచ్చాడు. రామారావు పేటకు రెండు, మూడు ఫర్లాంగుల దూరంలో ఎక్సయిజు కాలనీ కడుతున్నారు. దానికి మరో రెండు ఫర్లాంగుల దూరంలో ఉంది ఆ స్థలం. రామారావుపేట ఆనందరావు ఇంటికి అరమైలు పైనే ఉంటుంది. అంటే దాదాపు ఆనందరావు ప్రస్తుత నివాసానికి రెండు మైళ్ళ పైగా ఉన్నట్లు. స్థలం చూసివచ్చినతర్వాత అక్కడి వసతుల్ని గురించి, ముందు ముందు ఆ ప్రాంతం ఎంత అభివృద్ధి అయ్యేదీ వివరంగా భార్యతో చెప్పాడు. అన్నీ విని "ఆఁ మన దగ్గర అంత డబ్బు ఎక్కడుందిలెండి?" అన్నది నాంచారమ్మ.

"పిచ్చిదానా! ఇళ్ళు కట్టే వాళ్ళంతా సొంత డబ్బుతో కడతారనుకున్నావా? ఈ రోజుల్లో రక రకాల లోన్లు ఉన్నాయ్" అన్నాడు.

"అయినా మన కెందుకు లెండి! ఉండ టానికేదో పెద్దలిచ్చి వెళ్ళారు. ఆడపిల్లల పెళ్ళిళ్ళు అయిపోయాయనిపించి మన గూట్లో మనం ఉందాం" అని నాంచారమ్మ ఖచ్చితంగా చెప్పింది.

"సరేలే! నిన్నడగటం నాదే బుద్ధి తక్కువ. లోపలికి వెళ్ళి నీ పని చూసుకో!" అని భార్యను కసిరి తను కట్టబోయే ఇంటిని గురించి ఆలోచిస్తూ కూర్చున్నాడు ఆనందరావు.

మధ్యలో పెద్ద హాలు—దానికి అటు మూడు గదులు, ఇటు మూడు గదులు. వెనక వంటగది, పెద్ద డైనింగ్ హాలు, స్టోరురూమ్. ముందు హాలుకి రెండు వైపులా వసారా! వసారాకి మంచి డిజైను ఉన్న ఐరను మెష్. వసారా ముందు కాస్త పెద్ద సైజు పోర్టికో! ఇంటికి దక్షిణం వైపు మందారం గులాబి, గన్నేరు, నైట్‌క్వీన్, సింహాచలం, సంపెంగ మొదలైన పూల మొక్కలు—ఉత్తరం వైపు మల్లె, జాజి, విరజాజి, మాలతి మొదలైన పందిరి మొక్కలు,

కొండముది రుక్మిణీదేవి

ఎదురుగా అరడజను కొబ్బరి మొక్కలు. సుమ్మానికి అటు, ఇటు పోకచెట్లు. గేటుకి రెండు వైపులా అశోక వృక్షాలు—గేటు దగ్గరనుంచి వసారా వరకు ఉన్న ఫుట్‌పాత్‌కి అటునైపు, ఇటునైపు కూడా క్రోటన్స్! ఇక దొడ్డివైపు కిచెన్ గార్డెన్ వంగ, టొమాటో, బెండ, మిరప మొదలైనవే కాకుండా అరటి, బొప్పాయి, నిమ్మ లాంటివి కూడా వెయ్యాలని నిర్ణయించుకున్నాడు. అప్పుడుగాని తృప్తి లేదు. తనింకా స్థలమే కొనలేదని!

వాళ్ళు చెప్పిన ధర ప్రకారం ఆ ఎనిమిది వందల గజాల స్థలం ఇరవై మూడు వేల చిల్లర అవుతుంది. రిజిస్ట్రేషన్ ఖర్చులతో సహా ఒకటి అటూ ఇటూగా ముప్పై వేల వరకు అవుతుంది. ఆనందరావుకి సర్వీసు చాలానే ఉంది. పి. ఎఫ్. లోనుకి అప్లై చేసినా పదిహేను, పద్దెనిమిది వేలకు తక్కువ రాదు. ఇంకో పన్నెండు వేలు ఎక్కడ తీసుకువచ్చినా ఇంటికి శాంక్షను అయిన లోనులోనుంచి తీర్చవచ్చు అనుకుని ముందు పి. ఎఫ్. లోనుకి అప్లై చేశాడు. వెంటనే ఒకరిద్దర్ని ప్రయివేటుగా అడిగాడు. ఇంకా అవసరం అయితే ఉంటుందని పాత ఇంటి మీద కూడా తీసుకురావటానికి ఏర్పాటు చేశాడు. తీరా పి. ఎఫ్. పద్నాలుగు వేలే వచ్చింది. బయట రెండు, మూడు చోట్ల తీసుకు వచ్చింది ఐదేసు వేలకి మించ లేదు. మిగిలిన పైకం ఉంటున్న ఇంటి మీద తీసుకురాక తప్పలేదు. ఆనందరావుకి ఏది ఏమైనా తేనేం అనుకున్న ప్రకారం స్థలం తన పేర రిజిస్టరు చేయించుకుని, మర్నాడే ఒక ఆర్కిటెక్ట్‌కి మాట వదహార్లిచ్చి చాలా చక్కని ప్లాను గీయించి, లోన్లు ఇచ్చే అన్ని ఆఫీసులకూ తీసుకు వెళ్ళాడు. ఒకటి, రెండు ఆఫీసులవాళ్ళు ఆ ప్లాను చూసి ముచ్చటపడి "ముందు పునాది వెయ్యండి సార్! మా లోను సంగతి మేం చూస్తాం." అన్నారు.

దాంతో ఆనందరావుకి ఎక్కడలేని ఉత్సాహం పుట్టుకొచ్చింది. అంత ఆనందంలోనూ కొంత ఆలోచించి ఏ ఆఫీసు వాళ్ళు ఎక్కువ లోను ఇచ్చి తక్కువ వడ్డీ తీసుకుంటారో వాళ్ళతోనే డీలింగ్స్ పెట్టుకుని పాతిక ఇరవై వేల అప్పుతో పునాది చాలా స్ట్రాంగ్‌గా కట్టించాడు. దాన్ని తనిఖీ చేసిన ఇంజనీరు ఆనందరావుని పొగిడి పొగిడి తన సావకాశాల సంగతి బయట పెట్టాడు. అయినా ఆనందరావు బాధ పడలేదు. ఇంజనీరు సంతకం పెట్టాడంటే డబ్బు చేతికి వచ్చినట్టే కాబట్టి.

మర్నాడే లోను ఇచ్చే ఆఫీసుకు వెళ్ళాడు. ఆఫీసు వాళ్ళు వేల పాలిసీ మీద సంతకం పెట్టించుకుని ఇరవై మూడు వేల క్యాషు ఆనందరావు చేతి కిచ్చి "ఒకటికి రెండు సార్లు లెక్క పెట్టుకోండి" అన్నాడు.

ఆనందరావు అయిదు సార్లు లెక్క పెట్టినా ఇరవై మూడు వేలే కనబడుతున్నది. అయోమయంగా ఆఫీసరు వంక చూశాడు. ఆయన ఆప్యాయంగా నవ్వేకటి నవ్వి తిరిగి తన పనిలో నిమగ్నుడయ్యాడు.

ఆనందరావు తను కట్టిస్తున్న ఇంటిని గురించి కనబడ్డ ప్రతివాళ్ళ తోనూ చెప్పాడు. తలుపులూ, గుమ్మాలూ, కిటికీలు బ్లాక్ ఉడ్‌తో చేయిస్తున్నాడు. సిమెంటుకి, గానుగ సున్నానికి పెద్ద తేడా లేదని.

